## కామెడీ కథ

# దేవుడే కాపాడాలి!

**"అక్కడ లేటెస్ట్ పరిస్థితి ఏమిటి గుర్నాథం?" న్యూస్‌రీడర్ దైవాధీనం విసుగ్గా అడిగాడు. వెంటనే గుర్నాథం అందుకుని-**

''గంట సేపట్నుంచీ అందరూ ఎంత ప్రయత్నించినా పంది బురదలో నుంచి బైటికి రాలేదు.. ఎవరైనా దగ్గరికి వెళ్లాలని ప్రయత్నించినప్పుడల్లా అది బురద చిమ్ముతోంది. మున్సిపాలిటీ వాళ్లు ఇద్దరు పందులు పట్టేవాళ్లను పిలిపిస్తున్నారు .. నందనవనం నించి, కెమెరా మ్యాన్ మోషీడయాన్‌తో...గుర్నాథం....'' ఎప్పటికప్పుడు, బురదలో పంది వివరాలు మీకు తెలియజేస్తాం అంటూ మళ్లీ లైన్‌లోకొచ్చాడు దైవాధీనం.

''జూనియర్ డాక్టర్ల సమ్మె పదిహేడో రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి గుండు గురవయ్యగారి ప్రతిస్పందన...'' అని దైవాధీనం చిరాగ్గా మొహం పెట్టాడు.

ఆ ఛానెల్ ప్రతినిధి గురవయ్యతో-

''సమ్మె..వల్ల ప్రజలు ఇబ్బందులు....'' అని మాట్లాటడం పూర్తికాకముందే ''ఏం ఇబ్బందులు? ఎవడా తప్పుడు కూతలు కూసిన పుండాకోర్! మీకు తెలుసో తెలీదో.. ఈ పదిహేడు రోజుల్లో ఆస్పత్రిలో మరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. వీళ్ళ స్ట్రయిక్ చేయనప్పుడు..కేవలం పది రోజుల్లోనే రెండు వందలా నలభై ఆరు మంది చనిపోతే సమ్మె సమయంలో కేవలం పన్నెండు మంది మాత్రమే చనిపోయారు. అందువల్ల, జూనియర్ డాక్టర్లు సమ్మె చేయడమే మంచిది. వాళ్లు లేకపోతేనే సామాన్యులు బతికి బట్టగట్టగలరు'' దేవ రహస్యం బట్టబయలు చేస్తున్నట్టు చెవులదాకా నవ్వాడు గురవయ్య.

గురవయ్యతో లాభం లేదనుకున్నారు కాబోలు. ఆ ఛానెల్ ప్రతినిధి ఈసారి... శ్మశానంలో ఓ వ్యక్తితో మాట్లాడుతూ దర్శనమిచ్చాడు. ''జూనియర్ డాక్టర్ల సమ్మె వల్ల మీకేదైనా నష్టం..'' అని అనగానే.. భుజం మీద గొంగళి, తలపాగా... చేతిలో దుడ్డుకర్రతో ఉన్న ఓ వ్యక్తి 'థూ..' అని ఊసి.. ''ఆళ్లకి మా ఉసురు తప్పకుండా తగులుద్ది... పదిహేడు రోజుల్నుండీ... దాదాపు పస్తులుంటున్నాం... రోజుకి.. కనీసం పాతికా..యాభై శవాలయినా వచ్చేయి. ఇప్పుడు రోజుకి రెండో..నాలుగో వత్తన్నాయి..''

ఆ తర్వాత... బ్యాండు వాయించేవాళ్లు, పాడె కట్టేవాళ్లు... ఆఖరికి తద్దినం బ్రాహ్మలతో కూడా ఇంటర్వ్యూలు ప్రసారం చేసి, గవర్నమెంట్ మీద కసి తీర్చుకున్నారు ఆ ఛానెల్ వాళ్లు.

అంతవరకూ చూసిన ఆ ఛానెల్ ప్రసారాలు విసుగేయడంతో గవర్రాజు.. మరో ఛానెల్ ఆన్ చేశాడు.

స్క్రీన్ మీద.. ఓ టీనేజ్ అమ్మాయి కనిపించింది.

''ఆ.. మీరు... శేఖర్ కదూ... ఏంటి.. ఇన్నాళ్లకి గుర్తొచ్చానా? ఇన్ని రోజులూ ఫోనే చెయ్యలేదేం. ఊళ్లో లేరా? మీ నించి ఫోన్ కోసం చాలా రోజుల్నుంచీ ఎదురుచూస్తున్నాను. తెలుసా? పోన్లెండి.. ఇప్పటికైనా కనికరించారు..'' అంటూ

దేవుడే కాపాడాలి!

అదే ధోరణిలో మరో అర నిమిషం పాటు నానా వాగులుపోయింది.

సదరు శేఖర్‌గారు కోరిన.. 'నేనే తుపాకీ...నువ్వే లపాకీ' అనే మహత్తరమైన పాట మొదలయ్యేసరికి, శేఖర్ భార్యారత్నం బుగ్గపోట్లు పొడుస్తూ- ''ఎంత కాలంగా సాగుతోంది ఈ వ్యవహారం? దానికీ మీకూ ఏమిటి సంబంధం'' అని హిస్టీరిక్‌గా అరుస్తూ, తానో ప్రోగ్రాం మొదలెట్టి ఉంటుందనుకున్నాడు గవర్రాజు.

ఆ పాట పూర్తికాగానే.. మరో పనిపాటా లేని పాపారావ్, ''వెకిలిత గారూ.. మీరంటే.. మా ఇంట్లో అందిరికీ బోలెడు ఇష్టం.. ఆఖరికి మా కుక్కకి కూడా. మీరు రాగానే... మొరగడం ఆపేస్తుంది తెలుసా? మీ యాంకరింగ్ వెనక నించీ ముందు నించి కూడా చాలా బాగుంటుంది. మీ కోసం ఆరు నెల్లుగా కాలేజీ మానేసి ట్రై చేస్తున్నాను తెలుసా'' అంటూ వాగితే- వెకిలిత మొసలి పిల్లలా నోరు బార్లా తెరిచి అదే పనిగా నవ్వుతూ.. నానా వంకర్లు తిరిగి మురిసిపోవడం కాసేపు కొనసాగింది. గవర్రాజు తన చెంపలు తానే రీసౌండింగ్ ఎఫెక్ట్‌లా వాయించుకుని ఛానెల్ మార్చాడు.

శ్రీమతి అష్టచెమ్మా లక్ష్మీ ప్రోగ్రాం.. మొదలవుతున్నట్లు టైటిల్ కనబడింది. గవర్రాజు కుతూహలంగా చూడసాగాడు. మరుక్షణం.. ఆడాళ్లందరూ అసూయతో ఏడ్చి చచ్చేట్టు.. రెండు కిలోల నగలు... అంతే ఖరీదు చేసే పట్టుచీర కట్టుకుని చేతిలో, మొక్కజొన్న కంకి సైజు మైకుతో కనబడింది... తిన్నది అరక్క, పనీపాటా లేని ఓ అరడజను అమ్మలక్కలు.. ఓ కొంపలో కనిపించారు. మైకు పట్టుకున్న మహాతల్లి క్రూరంగా వాళ్లందరిచేతా నానా ఆటలూ.. పాటలూ పాడించింది. అర్థం పర్థం లేని పోటీలు పెట్టింది. చిన్న చిన్న పిండి ముద్దలు మొహానికి ఎవరెన్ని అంటించుకోగలరో... మిరపకాయలు ముక్కులో దోపుకుని ఎన్ని తుమ్ములు తుమ్మగలరో... కోడిగుడ్లు తలకేసి కొట్టుకుని పగలగొట్టగలరో... ఆఖరిగా తల గోడకేసి ఎన్నిసార్లు బాదుకోగలరో.. లాంటివి జరిపించింది. మొగుడ్ని ఏమార్చి.. మ్యాట్నీలకి ఎలా వెళ్లగలరో... మొగుడ్ని బ్లాక్‌మెయిల్ చేసి తాము కోరుకున్న చీరెలూ నగలూ గట్రా ఎలా సాధించగలరో పరీక్షలు పెట్టింది.

చచ్చుసామాన్లతో పుచ్చు వస్తువులు ఎలా చెయ్యొచ్చో కూడా కళ్లకి కట్టినట్టు చూపించబడింది. ఆఖరికి సూర్యకాంతం అక్కలా ఉన్న ఓ గయ్యాళి గంగమ్మని 'శ్రీమతి అష్టచెమ్మా లక్ష్మి'గా ప్రకటించి..ప్లాస్టిక్ బుట్ట లాంటి ఓ కిరీటం ఆమె తల మీద పెట్టింది.

గవర్రాజు కళ్లు తుడుచుకున్నాడు. ఇంతలో గవర్రాజు భార్య లంబోదరి రాకెట్‌లా దూసుకొచ్చి.. మరో ఛానెల్ పెట్టి.. కళ్లు చపాతీలంత చేసుకుని చూడసాగింది.

తాటిచెట్టంత పొడుగ్గా... మొబైల్ జ్యూయలరీ షాప్‌లా ఉన్న ఓ ఆవిడ... వెకిలిగా నవ్వుతూ... భరతనాట్యం చేస్తున్నట్టు నానా వంకర్లు తిరుగుతూ ఎవరిదో పేరు ఎనౌన్స్ చేసింది.

ఓ డజను భార్యాభర్తల జంటలు కుర్చీల్లో కనిపించాయి. వెనక వరసలో ఓ వానపాములా ఉన్న వ్యక్తి గింజుకోవడం.. అతని భార్య.. మొరట్టుగా అతన్ని ముందుకు నెట్టడం కనిపించింది.

''ఓబులేసు!'' అని ఆమె నాలుగోసారి అరిచింది. భార్య నెట్టిన నెట్టుడికి ఓబులేసు రైయ్‌మని వచ్చి ఎనౌన్సర్ కాళ్ల దగ్గర బోర్లాపడ్డాడు... ఆ మాత్రానికే అంతా చప్పట్లు కొట్టారు. ఓబులేసు పిచ్చిచూపులు చూస్తూ నిలబడ్డాడు.

''లంబూ! ఈ ప్రోగ్రాం పేరేంటి?'' అని గవర్రాజు కుతూహలంగా అడిగాడు.

''నీ అమ్మ కడుపు మాడ!'' రెప్ప వేయకుండా టీవీనే చూస్తూ అంది లంబోదరి.

గవర్రాజు త్రుళ్లిపడి ''నీకేం పొయ్యేకాలము

**మోర్తల ప్రభాకర్‌రెడ్డి**

చ్చిందే.... తిడుతున్నావ్..'' అంటూ విసురుగా కుర్చీలోంచి లేవబోతుంటే-

''అబ్బా! మీది మరీ చోద్యం... అదే ఈ ప్రోగ్రాం పేరండి.. ఆ మాత్రం.. మీకు తెలీదా?'' అంది లంబోదరి నిష్ఠూరంగా.

గవర్రాజు మరేదో అనేంతలో ''ఇది మగవాళ్లకి వెరైటీ ప్రోగ్రాం.. అదృష్టం బాగుంటే కిలో బంగారం దాకా గెలుచుకోవచ్చు. మీ పేరు కూడా పంపించాను. లాట్రీలో వస్తే బావుండును'' అంది సాలోచనగా.

''మరి అలాంటి పేరు పెట్టారేం... అయినా ఏం చెయ్యాలి తల్లి కిలో బంగారం గెలవడానికి?'' గవర్రాజు వ్యంగ్యంగా అన్నాడు.

''ఓ అదా... కొత్తరకంగా ఉండాలని ఆ పేరు పెట్టారు.. ఆఖరిలో గెలిచిన వ్యక్తిని ఎనౌన్సర్ 'నీ అమ్మ కడుపుమాడ' అని గోముగా తిడుతూ మెచ్చుకుంటుంది..'' అంది లంబోదరి ఎనౌన్సర్‌ని ఆరాధనగా చూస్తూ.

''నీళ్ల శ్రాద్ధం కాదూ..'' అని బైటికి అనబోయి.. అలాంటి ప్రోగ్రాం కూడా ఉందని వినాల్సి వస్తుందేమోనని భయపడి బుద్ధిగా టీవీ చూడసాగాడు గవర్రాజు.

ఓబులేసు కళ్లకి గంతలు కట్టి ఓ పెద్ద గాజు జాడీలో




ఉన్న పిల్లపాములు.. తేళ్లు.. ఎండ్రకాయలు. బొద్దింకలూ వగైరా.. గుర్తించమన్నారు.

ఆ జీవరాసులన్నిటితో తృప్తిగా కరిపించుకుని.. ఎలాగో అన్నీ గుర్తు పట్టి ఏడుపుముఖంతో నిలబడ్డాడు ఓబులేసు. ఆ తర్వాత అతన్ని కళ్లుమూసుకుని చెయ్యి చాపమని ఎనౌన్సర్ చెప్పింది.. కిలో బంగారం ఇచ్చేస్తారు కాబోలు అనుకున్న ఓబులేసు.. ఏడ్పు ఆపి.. ముసి..ముసిగా నవ్వుతూ ఆ పనే చేశాడు.. మరుక్షణం.. ఓ కొరడాతో అతని చేతి మీద బలంగా కొట్టి... అది ఏమిటో చెప్పమన్నారు... చెయ్యి ఊదుకుంటూ ''కొరడా'' అని అరిచాడు ఓబులేసు.

గర్వంగా మెటికలు విరుస్తూ కనిపించింది అతని భార్య. ఆ తర్వాత.. కాలుతున్న గరిటెతో ఇంటూ మార్క్ వేశారు. ఆ తర్వాత దబ్బనంతో అరంగుళం లోతుకు దిగేట్టు ఓ పోటుపొడవగానే.. ఇక ఓర్చుకోలేక ఓబులేసు ఎనౌన్సర్‌ని తోసేస్తూ.. బాధగా, భయంగా అరుస్తూ బైటికి పరిగెత్తాడు.

ఎనౌన్సర్ లేచి చీర సవరించుకుంటూ ''వీడమ్మ కడుపు మాడ.. ఈ మాత్రానికే పారిపోతే ఎలా? నెక్స్ట్!'' అంటూ మరో పేరు చదివింది...

ఇంతలో ప్రోగ్రాం టైం అయిపోవడంతో గవర్రాజు ఆనందించాడు.

''టైం ఎంత డాడీ..'' అని వాళ్ల ఆరేళ్ల సుపుత్రుడు నాని అడిగాడు. గవర్రాజు చెప్పాడు... కుతూహలంగా ''ఎందుకు రా'' అని అడిగాడు.

''మరేం లేదు డాడీ.. మరో నిమిషంలో 'నిప్పులు తొక్కిన కోతులు' ప్రోగ్రాం వస్తుంది'' అంటూ ఎవరి పర్మిషన్ లేకుండానే టీవీ ముందు కూర్చున్నాడు నానిగాడు.

పాపం ఎవరో పేదింటి అమ్మాయి కాబోలు... లోపలి లంగా, బ్రా లాంటిది ... ఏదో మాత్రమే వేసుకుని వచ్చి కల్లుతాగిన కోతిలా ఎగరసాగింది. ''ప్రోగ్రాం మొదలై చాలాసేపయినట్టుందిరా... నానీ!'' అని గవర్రాజు అనగానే అతని వైపు జాలిగా చూసి నానిగాడు ''అయ్యో అదేం కాదు డాడీ... ఆమె ఎనౌన్సర్.. ఇంకా అసలు డాన్సర్లు రాలేదు'' అని చిరాగ్గా అన్నాడు.

మరుక్షణం ఓ నాలుగేళ్ల పాప... అండర్ వేర్ మీద ప్రత్యక్షమై ''ఈ పిల్లా రసగుల్లా ఓ సర్కార్ సుభానల్లా'' అంటూ జ్యోతిలక్ష్మి కూడా సిగ్గుపడేంత లెవెల్లో చిందులు వేయసాగింది.

గవర్రాజుకి సిగ్గు, కోపం లాంటివి కలిగాయి. ఇంతలో వాళ్లకి చెప్పులు కూడా లేని దసరా వేషాలు వేసుకున్న ఓ అరడజను మంది వచ్చి, అక్షరాలా ఆ ప్రోగ్రాం టైటిల్ని సార్థకం చేస్తూ, నిప్పులు తొక్కిన కోతుల్లా, మరీ మాట్లాడితే కాసేపట్లో పక్షవాతం ఫ్లస్ ఫిట్స్ వగైరా రాబోతున్న వాళ్లలా ఏవో విన్యాసాలు చేయసాగారు. వాళ్లకి సాయంగా ప్రేక్షకుల్లో కొందరు ఎగరసాగారు. అంతవరకూ బుద్ధిగా కూర్చున్న నానిగాడు ఏదో పూనినట్టు టీ షర్ట్ తీసేసి మెడ చుట్టూ చుట్టుకుని, 'జంబా జంబా... రంబాహో.. పంబా పంబా పంబాహో..' అని అరుస్తూ ఎగరసాగాడు.

గవర్రాజు షాక్ నుంచి ఎలాగో తేరుకుని నానిగాడి చెవులు సాగదీసి డిప్ప మీద ఓసారి వాయించాడు. ఆ దెబ్బతో స్ప్రింగ్‌లా ఎగిరిపడి బిత్తరచూపులు చూస్తూ ఉండిపోయాడు.

గవర్రాజుకి విరక్తి కలిగింది. టీవీ ఆఫ్ చేయబోతుంటే లంబోదరి అతని కాళ్లమీద పడి ''నేను మిమ్మల్ని పొద్దుట్నించీ ఇప్పటి వరకూ ఏ కోరికా కోరలేదు. నా మాట మన్నించి ఆ ఒక్కటీ చూసే భాగ్యం కలగచేయండి యావండి'' అంటూ కాళ్లకి చుట్టేసింది.

''సరే! ఇంతకీ ఏంటా ప్రోగ్రాం... బాగుంటుందా?'' అన్ని అనుభవాలైనా పాఠం నేర్చుకోకుండా ఆశ చావక అడిగాడు.

''ఓ... మీరే చూస్తారుగా...'' అంటూ హుషారుగా చానెల్ మార్చింది.

''కొద్ది క్షణాల్లో పాము-ముంగిస ప్రోగ్రాం'' అని స్లయిడ్ కనబడ్డంతో మొదటిసారి గవర్రాజు రిలీఫ్‌గా ఫీలై ''లంబూ.. వెళ్లి నానిగాడ్ని పప్పీని పిలువ్... పిల్లలకి ఇంటరెస్టింగ్‌గా వుంటుంది'' అన్నాడు గవర్రాజు తొందరపెడుతూ.

''పోదురూ... బడాయి.. ఇది పిల్లల కోసం కాదు, మనలాంటి భార్యాభర్తల కోసం'' అంది సిగ్గులాంటిది పడుతూ.

పెళ్లాన్ని చావగొట్టే మగయాంకర్ మొగుడ్ని రాచి రంపాన పెట్టే ఓ ఆడయాంకర్ ఆ ప్రోగ్రాం మొదలెట్టారు.

''అవునూ... మీది ప్రేమ వివాహమా?'' ఇంటరాగేషన్ మొదలెట్టాడు భర్త యాంకర్... ఓ జంటని.

''ప్రేమ వివాహమే!'' విరక్తిగా అంది భార్య.

''మొదటిసారి మీ వార్ని ఎక్కడ ఎలా చూసారు?'' చిరాగ్గా అంది భార్య యాంకర్.

''వీడు... అదే ఈయన... అప్పట్లో రోజూ మా ఇంటి ముందున్న కిళ్లీకొట్టు దగ్గర కనిపించేవాడు. నా వెంటపడి... ఆకులో ఆకునై అంటూ కొన్ని సార్లు కైకే పాన్ బనారస్‌వాలా అంటూ హిందీలో కూడా పాడుతూ నన్ను ఆకట్టుకున్నారు. తర్వాత తెలిసింది ఆ కిళ్లీ కొట్టు ఆయనదే అని..'' కళ్లు తుడుచుకుంది భార్య.

''మీకు మొదటిసారి మీ శ్రీమతిని చూసినప్పుడు ఏమనిపించింది?'' సానుభూతిగా చూస్తూ అడిగాడు మగ యాంకర్.

''ప్చ్! మొదటిసారి చూసినప్పుడు అదే ఆఖరిసారి అయితే బాగుండును అనిపించింది..'' అని తేరుకుని ''అలా చాటుమాటుగా చూడడం ఆఖరిసారి అయి ఎప్పటికీ హక్కుగా నిత్యం చూస్తూ ఉండిపోయేరోజు ఎప్పుడొస్తుందా అని అనిపించింది'' అని పచ్చి అబద్ధం చెప్పాడు.


''మీరింత కాలం ఎలా కలిసి ఉండగలిగారు? అందుకు కారణాలు ఏమిటి?'' ఆడ యాంకర్ అడిగింది అనుమానంగా చూస్తూ.

'మాకూ అదే ఆశ్చర్యం' అని మనసులోనే అనుకుని- ''గతిలేక..'' అనేసాడు భర్త.

అందరూ అవాక్కయి చూస్తుండగా సర్దుకుని ''నా ఉద్దేశం ఆమెని విడిచి నేనూ నన్ను విడిచి ఆమే ఒక్క క్షణం కూడా ఉండలేనంత ప్రేమ మా మధ్య నెలకొంది. మేం విడిపోతే విరహంతో బాధతో చచ్చిపోవడం ఖాయం. అందుకే... మా ప్రేమని కాపాడుకోవడానికి మరో గత్యంతరం లేక అలాగే కలిసి

## ఇదోరకం పాపులారిటీ!

**అశిన్ సినీతారగా కాకుండా మోడల్‌గా కూడా అనేక యాడ్స్ చేస్తూ బిజీగా వుంది. టీవీ పెడితే చాలు ఈమధ్య అశిన్ యాడ్స్ కనిపిస్తూనే వున్నాయి కదా! అయితే అశిన్ మాత్రం ఇకపై తను యాడ్స్‌లో ఎక్కువగా నటించనని సెలవిస్తోంది. 'మరీ ఇరవై నాలుగ్గంటలూ నా యాడ్స్ చూస్తే జనం విసిగిపోయి నాపై అభిమానాన్ని తగ్గించేసుకుంటారు. అందుకనే యాడ్స్‌ని వీలైనంత వరకూ తగ్గించుకుంటూ సెలక్టెడ్ చిత్రాల్లోనే నటిస్తేనే ప్రేక్షకులకు బోర్ అనిపించదు'- అంటోంది ఇరవయ్యేళ్ల అందాల కేరళ భామ.**



ఉన్నాం'' కుమిలిపోతూ చెప్పాడు భర్త.

''మీ ప్రేమ అంతగా ప్రకోపించడానికి ఐ మీన్... పెరగడానికి కారణం?''

ఈసారి భార్య కల్పించుకుని ''సింపుల్... ఒకరి నొకరు అర్థం చేసుకోకపోవడమే'' అంది తాపీగా.

అందరూ నవ్వుతుండడం చూసి సర్దుకుని ''నా ఉద్దేశం మనం అవతలి వాళ్లకి పూర్తిగా అర్థం అయి పోతే అవతలి వాళ్లకి మన మీద ఆసక్తి సదభి ప్రాయం తగ్గిపోతాయి. ఓస్... వీళ్లు ఇంతేనా ఇలాంటి వాళ్లా అనుకుంటారు. భార్యాభర్తలయినా సరే, అందుకే... మేం ఎప్పుడూ ఒకరికొకరు ఎక్కువ అర్థం కాకుండా జాగ్రత్త పడ్డాం'' మొదటి సారి నిజం చెప్పింది ఆమె.

''ఇక ఇప్పుడు మీరు సినిమాకి తీసుకెళ్ల లేదని సరదాగా మీ భర్తతో పోట్లాడాలి'' యాంకర్ అన గానే-

భార్య హుషారుగా లేచి పమిట చెంగు బొడ్లో దోపుకుని ''రేయ్ సత్తిగా! ఇప్పుడా కొంపకి రావడం? ఎక్కడెక్కడ తిరిగి వస్తున్నావ్? నెల రోజుల్నించీ సినిమాకి తీసుకెళతానని చెప్పి నన్ను వెర్రిదాన్ని చేస్తావా? ఇవాళ అయిపోయావురా నా చేతిలో'' అంటూ మొగుడి చొక్కా పట్టుకుని పొట్టలో ఓ గుద్దు గుద్దింది. దాంతో మొగుడు కూడా రెచ్చిపోయి ''రాక్షసీ! ఎంతకి తెగించావే..? నీ యవ్వ'' అంటూ భార్య జుట్టు పట్టుకుని వొంగోపెట్టి పిడిగుద్దులు గుద్దసాగాడు. వాళ్లు అలా నిజజీవితంలో తరుచూ చేసే పనిలో పూర్తిగా లీన మైపోయారు.

''కట్... కట్... ఆగండి., ఆగండి'' అని యాంకర్లు ఇద్దరూ వాళ్లని విడదీయబోయారు. అదే వాళ్లు చేసిన తప్పు. అర నిమిషంలో వాళ్లిద్దరి మొహాలు పచ్చడైపోయాయి. బట్టలు చిరిగిపోయి విగ్గూ గట్రా ఊడిపోయి తుపాను బాధితుల్లా తయారయ్యారు.

పిల్లలు చప్పట్లు కొడుతూ చూడసాగారు. లంబోదరి, గవర్రాజు మొహంలోకి చూడలేక చూపు తప్పించి అక్కడ్నుంచి లేచిపోయింది.

''ఏమండీ... 'చీరెత్తుకెళ్లండి చింపాజీలా' ప్రోగ్రాం ఒక్కటి చూడనివ్వండి'' అంది దూరంగా నిలబడి బిక్కుబిక్కుమంటూ.

''అదొక్కటీ ఎందుకు? 'గోచీ' లాక్కు పాండి-గొరిల్లాలా' కూడా చూద్దువుగానీరా... ఛీ...సిగ్గు లేదటే నీకూ? రోజూ ఇవన్నమాట నువ్వు చూసే అద్భుతమైన ప్రోగ్రాంలు!'' ఈసడిం పుగా అన్నాడు గవర్రాజు.

''పోనీ... కనీసం 'తగినాశాస్త్రి' డెయిలీ సీరియల్ అయినా చూడనివ్వండి. నేను ఆరో క్లాసు చదువు తున్నప్పుడు మొదలైంది. ఇంతవరకూ ఒక్క ఎపి సోడ్ కూడా మిస్ కాలేదండీ. ఇవాళ ఆఖరి ఎపిసోడ్ అట.. ప్లీజ్...'' అంది కళ్లనీళ్లు పెట్టుకుంటూ.

లంబోదరి ఏడవడం కన్నా ఒక డెయిలీ సీరియల్ ముగుస్తుందనే విషయం ఏదో వింతగా అనిపించి- ''ఊ... సరే'' అని లంబోదరికి వరమిచ్చాడు గవ ర్రాజు.

ఎపిసోడ్ నెంబర్ 6786 అని స్క్రీన్ మీద కనిపించింది. మరో నిమిషంలో ఎపిసోడ్ ముగుస్తుందనగా... ఫ్లాష్ ఫ్లాష్ అని స్క్రీన్ మీద కనిపించింది. 'ప్రేక్షకుల ప్రతి స్పందనను చూసి మాకు ఇష్టం లేకపోయినా ఈ సీరియల్ మరో పదేళ్లు మాత్రమే పొడిగించడానికి ఆనందిస్తున్నాం' అని కనిపించింది.

లంబోదరి ఆనందం పట్టలేక చప్పట్లు కొట్టసా గింది.

గవర్రాజుకి దైవభక్తి ఎక్కువ. పురాణగాధలంటే ఒకటో రెండో భాగాలు తప్ప వొళ్లంతా కోసుకుం టాడు. అలాంటిది 'భాగవతం' అని స్క్రీన్ మీద కనిపించడంతో పారవశ్యంతో కళ్లు మూసుకుని తర్వాత తెరిచాడు.

కృష్ణుడు కొందరు గోపికలూ మరెవరో జనాలు కనిపించారు. ''పప్పీ! యానిమల్ వరల్డ్ వస్తుం దిరా..'' అంటూ నానిగాడు వాళ్ల అక్కాయ్‌ని పిల్చి ఉత్సాహంగా చూడసాగాడు. లంబోదరికి అలాంటి ప్రోగ్రాంలు గిట్టవు. కిసుక్కున నవ్వింది. గుర్నాధం గుర్రుగా చూసాడు. అతనికి అందులో యాక్టర్లని చూస్తుంటే విరక్తిగా అనిపించింది. ఒక్కొక్కరికి వాళ్లు ఎవరో బోర్డు మీద రాసి మెడలో వేలాడదీస్తేగానీ జనం గుర్తించలేనంత ఘోరంగా ఉన్నారు.

యశోద పాత్రధారిణి ''రా కృష్ణయ్యా'' అంటూ ఆప్యాయంగా పిలిచి కృష్ణుడు అలా ఆమెని దాటగానే క్రూరంగా చూస్తూ పళ్లు కొరి కింది. గవర్రాజు బిత్తరపోయాడు. ''ఆమెకి అత్తా కోడళ్ల సీరియల్స్ వేసి వేసి అలా అలవాటైపో యింది'' అంది చాలా మామూలుగా లంబోదరి.

''పంది ఇంకా బురదలోనే ఉంది. ఇప్పుడు ఉడ తలు పట్టే వాళ్లతో ముఖాముఖి... మా ప్రత్యేక ప్రతినిధి.. దైవాదీనం...'' మరేదో అంటుండగా గవర్రాజు లాంటి ఎంతోమంది మొర ఆలకించి నట్టు దేవుడు కరెంట్ కట్ చేసి తాత్కాలికంగా వాళ్లని రక్షించాడు.

## అభిమన్యుడిగా సుమంత్?

**ఇటీవల 'గోదావరి' సినిమాతో హిట్టు కొట్టిన సుమంత్‌కి వెరైటీ పాత్రలు పోషించి ప్రేక్షకుల్ని మెప్పించాలని వుందిట. అందులో భాగంగానే 'అభిమన్యుడు' పాత్రని పోషించాలని ఆశ పడుతున్నాడు. టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందిన ఈరోజుల్లో ఓ పౌరాణిక చిత్రం అందునా అభిమన్యుడి కథతో తీస్తే గనక జనానికి బాగా నచ్చుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాడు సుమంత్.**

